
ప్రజాశక్తి
సోమవారం 10 జూన్ 2024 5
విజయనగరం



ఎస్‌జిఎఫ్ కార్యదర్శి పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం జిల్లాలో స్కూల్ గేమ్స్ సెక్రటరీ పోస్టుకు అర్హత, ఆసక్తి ఉన్న స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఫిజికల్ డైరెక్టర్లు) పోస్ట్‌లో పని చేయుచున్న వారు దరఖాస్తులు చేసుకోవచ్చని డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ / జిల్లా పరిషత్ యాజమాన్యంలో పనిచేస్తున్న పీడీలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. స్కూల్ గేమ్స్ సెక్రటరీగా రెండేళ్ల పదవీ కాలం ఉంటుందని చెప్పారు. ఈ నెల 22లోగా ప్రధానోపాధ్యాయులు, ఉప విద్యాశాఖాధికారి కౌంటర్ సైన్‌తో దరఖాస్తులను కార్యాలయంలో అందజేయాలని సూచించారు.



గుమ్మడి, కొండపల్లికి మంత్రి ఛాన్స్..!

సామాజిక కోణంలో సాగుతున్న చర్చ



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి/బొబ్బిలి

సాలూరు ఎమ్మెల్యే గుమ్మడి సంధ్యారాణి, గజపతినగరం ఎమ్మెల్యే కొండపల్లి అప్పలనాయుడుకు రాష్ట్రమంత్రి వర్గంలో చోటు లభించనుందా? అన్న ఊహాగానాలు జిల్లాలో వ్యక్తమౌతున్నాయి. లేదంటే కొండపల్లికి బదులు చీపురుపల్లి ఎమ్మెల్యే కళా వెంకటరావుకు ఛాన్సు ఉందని చర్చ సాగుతోంది. ఈసారి ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికనే మంత్రి పదవులు కేటాయింపు ఉంటాయన్న సంకేతాలు వెలువడుతున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాకు రెండు మంత్రి పదవులు ఖాయమని పలువురు విశ్లేషిస్తున్నారు. టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులుగా ఉన్న సంధ్యారాణి సుదీర్ఘకాలంగా ఎన్నికల్లో పోటీచేస్తున్నారు. దీనికితోడు మిగిలిన గిరిజన ఎమ్మెల్యేలతో పోలిస్తే సీనియర్ అని చెప్పుకోవచ్చు. పేరుకు ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన మంత్రి పదవులు ఉంటాయని చెప్తున్నప్పటికీ మన్యం ప్రాంతానికి ఒక మంత్రి పదవి కేటాయించే అవకాశం లేకపోలేదు. ఈ లెక్కన సంధ్యారాణి తప్పక మంత్రి అవుతారనే ఆశాభావం ఆమె అనుయాయులు వ్యక్తం చేస్తున్నారు. మరో మంత్రి పదవి బొబ్బిలి లేదా విజయనగరం రాజులకు కేటాయిస్తారా? బిసిలకు కేటాయిస్తారా? అన్నది మరో చర్చ. ఈ లెక్కన బిసిలకు కేటాయిస్తే గజపతినగరం ఎమ్మెల్యే కొండపల్లి శ్రీనివాసరావు, లేదా చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావుకు దక్కే అవకాశాలు ఉన్నాయన్న చర్చ నడుస్తోంది. వెంకటరావు సీనియర్ అయినప్పటికీ ఈసారి రాష్ట్ర వ్యాప్తంగా యువతను ప్రోత్సహించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ లెక్కన శ్రీనివాసరావుకు అవకాశం దక్కవచ్చనే ఊహాగానాలు వ్యక్తమౌతున్నాయి. లేదా సీనియర్ల అవసరం తప్పనిసరి అనిభావిస్తే కిమిడికి మరోసారి మంత్రి పదవి దక్కే అవకాశాలు లేకపోలేదు. టిడిపి ఏర్పడిన ప్రతిసారీ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ జగపతిరాజు తప్పక మంత్రి అయ్యే వారు. ఈసారి ఆయన పోటీలో లేకపోవడం వల్ల ఎస్‌టి, బిసిలకు పదవులు దక్కవచ్చనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఒక వేళ రాజకీయ చరిష్మా, నాయకత్వ వారసత్వానికి ప్రాధాన్యత ఇస్తే బొబ్బిలి లేదా విజయనగరం రాజులు (బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన, అదితి విజయలక్ష్మి గజపతిరాజు)లో ఎవరో ఒకరికి ఇస్తారనేది మరోవైపు చర్చ నడుస్తోంది. మరోవైపు సామాజిక కోణంలో రాజాం ఎమ్మెల్యే, మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్ కూడా మంత్రి పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా టిడిపి యువతను ఎక్కువగా ప్రోత్సహించింది. ముఖ్యంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ కూడా భవిష్యత్తు రాజకీయాల దృష్ట్యా యూత్‌కు ఎక్కువగా అవకాశం కల్పించారు. అందులో భాగంగానే మన జిల్లాలోని కొండపల్లి శ్రీనివాస్‌కు ఎమ్మెల్యేగా సీటు కేటాయించారు.



అగ్రహారానికి మోక్షం కలిగేనా?

అగ్రహారానికి మోక్షం కలిగేనా? గత పాలకులు చేపట్టిన నోటిఫికేషన్ ప్రక్రియ పూర్తయ్యేనా? అంటే అవుననే ఆశలు రైతుల్లో కనిపిస్తున్నాయి. ఎన్నికల ప్రచారంలో కూటమి అభ్యర్థి కోళ్ల లలితకుమారి అగ్రహారం భూముల సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆమె ఎమ్మెల్యేగా ఎన్నికవడం, కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో అగ్రహారం భూముల సమస్యపై ప్రత్యేక దృష్టిసారిస్తారని రైతాంగం భావిస్తోంది. ఇదే జరిగితే, తాతల తండ్రుల నాటి సమస్యకు స్వస్తి పలికే అవకాశం లేకపోలేదు. ఈ నేపథ్యంలోనే జామి మండల కేంద్రంలోని వేలాది మంది రైతులు ఎమ్మెల్యే కోళ్లపై ఆశలు పెట్టుకున్నారు.

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కోళ్ల హామీ
- జామిలో అన్నదాతల ఎదురుచూపులు

ప్రజాశక్తి - జామి

తాతలు తండ్రుల కాలం నుంచి భూములకు హక్కులు లేకుండా అన్నదాతలు నానా అవస్థలు పడుతున్నారు. పాలకులు మారుతున్నారు తప్ప... అగ్రహార భూముల సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. ఈ నేపథ్యంలోనే గత ఏడాది మే 25 తేదీన భూములకు అప్పటి తహశీల్దార్ పబ్లిక్ నోటిఫికేషన్ వేసి అన్నదాతల్లో ఆశలు రేపారు. తాత ముత్తాతల కాలం నుంచి సాగుచేస్తున్న భూములను ఇనాం వాటా కింద 1/3 షేర్ కేటాయించిన అధికారులపై మండిపడినా, ఇప్పటికైనా భూసమస్య పరిష్కారానికి నోచుకుంటుందని ఆశ పడ్డారు. నోటిఫికేషన్‌లోని ఉన్న అనేక తప్పులు తడకలు ఉన్నప్పటికీ సమస్య పరిష్కారం కోసం ప్రశ్నించకుండా అధికారులకు సహకరించాలని భావించారు. తమ భూములపై అభ్యంతరాలను అధికారుల సూచనల మేరకు అందజేశారు. ఈ పక్రియ జరిగి సుమారుగా ఏడాది కావస్తున్నా... అగ్రహారంపై ఎటువంటి అడుగులూ ముందుకు పడలేదు. ఈ నేపథ్యంలోనే ఎన్నికలు రావడం, టిడిపి కూటమి ఘన విజయం సాధించడంతో ఈసారైనా సమస్య పరిష్కారం అవుతుందని రైతులు గంపెడు ఆశలు పెట్టుకుంటున్నారు.

చొరవ చూపిస్తే... సాధ్యమే

జామి మండల కేంద్రంలో సుమారుగా 2600 ఎకరాల వరకు ఇనాం భూములు (అగ్రహారం) కింద ఉన్నాయి. వీటికి హక్కులు కల్పించాలని రైతుల ఏళ్ల నాటి కల. 2009లో భూ సర్వే ప్రారంభమైతే, గత ఏడాది 25 తేదీన అప్పటి తహశీల్దార్ నోటిఫికేషన్ విడుదల చేశారు. 30 రోజుల్లో నోటీసులో పొందుపర్చిన వివరాలపై అభ్యంతరాలు తెలపాలని పేర్కొన్నారు. ప్రధానంగా నోటిఫికేషన్‌లో ఇనాందారుని పేరు రాయకుండానే ఇనాం వాటా కింద 1/3 భూమిని కేటాయించడం గందరగోళాన్ని సృష్టించింది. దీంతో ప్రతి రైతూ అభ్యంతరం తెలపాల్సిన పరిస్థితి దాపురించింది. నూటికి నూరు శాతం రైతులు అభ్యంతరాలు తెలిపారు. ఇది జరిగి ఏడాది కావస్తున్నా... ప్రక్రియ ముందుకు సాగలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో టిడిపి అభ్యర్థి కోళ్ల లలితకుమారి అగ్రహార భూ సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.. ఈ నేపథ్యంలోనే నూతన ప్రభుత్వంపై రైతులు ఆశలు పెట్టుకున్నారు.


ఎం.రిషివర్ధన్ 59వ ర్యాంకు


డి.శ్రీనిధి 326వ ర్యాంకు


ఎ.హేమంత్ 521వ ర్యాంకు


ఎం.హర్షవర్ధన్ 780వ ర్యాంకు

జెఇఇలో సత్తాచాటారు

జిల్లా విద్యార్థులకు మెరుగైన ర్యాంకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఇఇ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో విజయనగరం జిల్లా విద్యార్థులు సత్తాచాటారు. దత్తిరాజేరు మండలం గదబవలసకు చెందిన మజ్జి రిషివర్ధన్ ఆలిండియా స్థాయిలో జనరల్ కేటగిరీలో 59వ ర్యాంకు సాధించాడు. ఒబిసి కేటగిరీలో నాలుగో ర్యాంకు సాధించాడు. రిషివర్ధన్ తండ్రి తిరుపతిరావు గజపతినగరం మండలంలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. తల్లి సంతోషికుమారి గృహిణి. రిషివర్ధన్ విశాఖలోని నారాయణ కళాశాలలో ఇంటర్ విద్యనభ్యశించాడు.

నగరంలో శ్రీచైతన్య విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థుల్లో డి.శ్రీనిధి జాతీయ స్థాయిలో 326వ ర్యాంకు, బి.సందీప్ శంకర్ 6137 ర్యాంకు సాధించారు. ఎన్.ఈశ్వర్ అక్షయ ఒబిసి కేటగిరీలో 1787 ర్యాంకు సాధించారు. వీరిని కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.


బి.సందీప్ శంకర్ 6137వ ర్యాంకు


ఎన్.ఈశ్వర్ అక్షయ్ 1787వ ర్యాంకు(ఒబిసి)

అల్లు హేమంత్‌కుకు 521వ ర్యాంకు

విజయనగరానికి చెందిన అల్లు హేమంత్‌కు జాతీయ స్థాయిలో 521వ ర్యాంకు సాధించాడు. ఒబిసి కేటగిరీలో 75వ ర్యాంకు పొందాడు. తెలంగాణ ఎంసెట్‌లో హేమంత్ 20వ ర్యాంకు సాధించడం గమనార్హం. హేమంత్ తండ్రి ఎవిఎస్ నాయుడు నగరంలో కలాం కళాశాల డైరెక్టర్‌కాగా, తల్లి రాజేశ్వరి ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్నారు.

హర్షవర్ధన్‌కు 780వ ర్యాంకు

రేగిడి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన మొయ్యి హర్షవర్ధన్ జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షలలో ఆలిండియా స్థాయిలో 780వ ర్యాంకు సాధించాడు. ఒబిసి కోటాలో 115 ర్యాంకు పొందాడు. హర్షవర్ధన్ తల్లిదండ్రులు మొయ్యి జనార్దన్‌రావు, రాజ్యలక్ష్మి ఉపాధ్యాయులు.

అభినవ్‌కు 5564వ ర్యాంకు

బొబ్బిలి పట్టణానికి చెందిన గంట గురుదత్త అభినవ్ జెఇఇ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచాడు. జాతీయ స్థాయిలో 5564వ ర్యాంకు, ఒబిసి కేటగిరీలో 1094వ ర్యాంకు సాధించాడు. అభినవ్ విజయవాడలోని ఒక ప్రయివేట్ పాఠశాలలో ఇంటర్ పూర్తి చేశాడు.


జి.జి.అభినవ్ 5564వ ర్యాంకు

జిఒ 117ను రద్దుచేయాలి

ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యారంగానికి నష్టం కలిగించే జిఒ 117ను రద్దు చేయాలని ఎపిటిఎఫ్ (1938) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక యూత్ హాస్టల్‌లో నిర్వహించిన ఎపిటిఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా రంగంలో ఆంగ్ల మాధ్యమంతో సమానంగా తెలుగు మీడియం కొనసాగించాలన్నారు. ఉన్నత పాఠశాలలో ప్రాథమిక పాఠశాలల విలీనం ప్రక్రియను రద్దు చేయాలన్నారు. ఉపాధ్యాయులను ఆందోళన కలిగించే, మానసిక క్షోభకు గురి చేసే పాఠశాల ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌ను బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించి, సిపిఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ ఖాళీ పోస్టులు భర్తీకి మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు.

సమావేశంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎ,సదాశివరావు, డి.ఈశ్వరరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.బలరామినాయుడు, ఎన్‌వి పైడిరాజు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నగర పాలక సంస్థ పరిధిలో మురుగునీటి పారుదల వ్యవస్థ ఆస్తవ్యస్తంగా ఉంది. చెత్తా చెదారంతో నిండిన పరిస్థితి. మురుగు కదలదు.. వదలదు అన్న చందంగా పరిస్థితి తయారైంది. సాధారణంగా ఏటా వర్షాకాలం ముందే కాలువల్లో పూడిక తొలగించాల్సి ఉంటుంది. ఈ ఏడాది ఎన్నికలు కావడంతో నగరంలో పూడికతీత పనులు చేపట్టలేదు. ప్రధాన కాలువలు పూడికతో నిండి పోయినా ఆ దిశగా చర్యలు లేవు. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా.. ఆయా ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. రెండు సార్లు సాయంత్రం కురిసిన వర్షానికి కార్పొరేషన్ కార్యాలయ పరిసర ప్రాంతాలు చెరువును తలపించేలా నీరు నిండిపోవడమే అందుకు నిదర్శనం.


గంట స్థంభం వద్ద పెద్ద కాలువలో పేరుకుపోయిన చెత్త

తప్పని ముప్పు

- చిన్నపాటి వర్షానికి ముంపు భయం
- నగరంలో అధ్వానంగా కాలువ వ్యవస్థ
- అమలుకు నోచుకోని అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పదేళ్ల క్రితం నగరంలోని సిటీ స్టాండుకు వెళ్లే దారిలో కర్రబడ్డీల వద్ద ఉన్న కాలువలో వరదనీటి ఉధృతికి ఓ మహిళ కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. అప్పట్లో ఈ ఘటన సంచలనం సృష్టించింది. ఇప్పటికీ ఆ కాలువపై పలకలు వేయలేదు. దీంతో అక్కడ ముప్పు పొంచి ఉంది. నగర పాలక సంస్థ కార్యాలయ సమీపంలో కాలువలతోపాటు గంటస్తంభం, పిడబ్ల్యు మార్కెట్, సిటీ స్టాండ్, లంకవీధి వద్ద కాలువలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో వరద నీటి కాలువలు 100 మీటర్ల పరిధిలో ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ప్రస్తుతం అన్నీ పూడికతో దర్శనమిస్తున్నాయి. ట్యాంక్‌బండ్ రోడ్డులో ఎల్ఐసి కార్యాలయం వద్ద నుంచి నాయుడుకాలనీ, వినాయకనగర్, పద్మావతినగర్ మీదుగా ధర్మపురి వరకు 3 కిలోమీటర్ల మేర పెద్దకాలువలు ఉన్నాయి. వీటిలో ఎక్కడా పూడిక తీసిన ఆనవాళ్లు లేవు. వర్షం కురిస్తే సిటీ స్టాండ్, నగర పాలక సంస్థ కార్యలయం, గంటస్తంభం, పార్కు గేటు కూడలి ముంపునకు గురవుతాయి. ధర్మపురి, రింగ్‌రోడ్డు ప్రాంతాలతోపాటు పలు కాలనీల్లో ఇవే పరిస్థితులు నెలకొంటున్నాయి.

నగరంలో మురుగు కాలువలు రోజుల తరబడి శుభ్రం చేయడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయి. మధ్యాహ్నం వేళల్లో గ్యాంగ్ వర్కు ద్వారా పూడికతీత చేపట్టేవారు. ఇప్పుడు పూర్తిస్థాయిలో జరగడం లేదు. మరికొన్ని చోట్ల కాలువల్లో నాణ్యతాలోపాలు, వంకర టింకర కట్టడాలతో మురుగునీరు ముందుకు వెళ్లకుండా రోడ్డెక్కుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఇక నగరంలో భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు కలగానే మిగిలింది. ఇది కేవలం డిపిఆర్ తయారు వరకు పరిమితమైంది తప్ప ఆచరణకు నోచుకోలేదు. కాలువ వ్యవస్థ మెరుగు కోసం శాశ్వత పరిష్కారం దిశగా భూ గర్భ కాలువ వ్యవస్థ నిర్మాణం జరిగితే తప్ప పరిష్కారం లభించదు. అది ఎప్పటికి పూర్తవుతుందో పాలకులు చెప్పాల్సి ఉంది. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం దృష్టి పెడుతుందో, లేదో వేచి చూడాల్సిందే.


గూడ్సు షెడ్ వద్ద అధ్వానంగా ఉన్న కాలువ

మాధవికి రాధేయ కవితా పురస్కారం

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఖమ్మం జిల్లాకు చెందిన కవయిత్రి ఫణి మాధవి కన్నోజుకు డాక్టర్ రాధేయ కవితా పురస్కారం లభించింది. స్థానిక గురజాడ కేంద్ర గ్రంథాలయంలో సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్ అధ్యక్షతన ఈ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు అవార్డును కవి డాక్టర్ రాధేయ అందజేశారు. అనంతరం ప్రముఖ రచయితలు గంటేడ గౌరునాయుడు, అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం సాహిత్యం ఎలా ఉంది? సాహిత్యాన్ని ఎలా ముందుకు తీసుకెళ్లాలి? అనే అంశాల గురించి వివరించారు. సాహిత్యం తరతరాలకి కొనసాగాలని ఆకాంక్షించారు. డాక్టర్ రాధేయ మాట్లాడుతూ కళింగాంధ్రతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పలువురు రచయితలు పాల్గొన్నారు.


మాధవికి పురస్కారాన్ని అందజేస్తున్న డాక్టర్ రాధేయ, రచయితలు

గవర కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి రుక్మిణి రాజీనామా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గవర కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి ఆడారి రుక్మిణి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసిపి ఓటమి కారణంగా ఆమె పదవికి రాజీనామా చేశారు. తనకు డైరెక్టర్ పదవి రావడానికి కారణమైన మాజీ ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

బయటపడుతున్న అసంతృప్తులు

'ఆయన చెప్పిందే వినాలి. మనం చెప్పింది వినే పరిస్థితి లేదు. కనీసం భాధ చెప్పుకుందామన్నా ఎప్పుడు ఏ విధంగా కోపం చూపిస్తారోనన్న భయం. సచివాలయ సిబ్బంది మాట వినరు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఖాతరు చేయరు. కార్పొరేటర్‌ని అయినా పని చేయించుకోవాలంటే, ఎమ్మెల్యేతో చెప్పించండని సిబ్బంది అనడం. కార్పొరేటర్‌కి ఉన్న విలువ లేదు. ఈ బాధల నుంచి విముక్తి కలుగుతుంది. ఏదైతేనేం ఇప్పుడైనా స్వేచ్ఛగా మాట్లాడే పరిస్థితి వచ్చింది.'


- ఇదీ విజయనగరం నియోజకవర్గంలో రెండో స్థాయి నాయకులు, కార్పొరేటర్ల మధ్య ఇటీవల కాలంలో జరుగుతున్న చర్చ.

ఊపిరి పీల్చుకుంటున్న కార్పొరేటర్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెల్లడైన అనంతరం నగరంలో, నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. అసంతృప్తులు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఏదైనా పని చేసుకుందామా? అంటే వార్డుల్లో కార్పొరేటర్లకు పోటీగా, పక్కలో బల్లెంలా ఇంకొక నాయకుడిని తయారు చేయడం వంటి చర్యలు మాజీ ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి భారీ తేడాతో ఓటమికి కారణంగా తెలుస్తోంది. మొన్నటి వరకు మింగలేక కక్కలేక మిన్నకుండిపోయిన నాయకులు... ఘోర ఓటమి చెందడంతో మాజీ ఎమ్మెల్యే తీరుపైన, కుటుంబ సభ్యులు, అనుచరుల వ్యవహార శైలిపైనా చర్చలు పెడుతున్నారు. కొంతమంది అయితే 'జరగాల్సిన శాస్తి జరిగింది. కింది స్థాయి నాయకులను గుర్తించకపోతే ఇలాగే ఫలితాలు ఉంటాయి. కళ్లు తెరుస్తారు' అంటూ అసంతృప్తి వెళ్లగక్కుతున్నారు. కార్పొరేటర్లు, కింది స్థాయి నాయకులు ఎమ్మెల్యే తీరుపై నేడు బాహాటంగా చెబుతున్న పరిస్థితి నెలకొంది.

విజయనగరం నియోజకవర్గ ఎన్నికల చరిత్రలో ఎప్పుడూ ఇంత భారీ తేడాతో ఓడిపోయిన అభ్యర్థి లేరు. ఒకటి ప్రభుత్వ వ్యతిరేకత కారణంగా 30 వేలు ఓట్లు, రెండోది వ్యవహార శైలి కారణంగా మరో 30 వేలు ఓట్లు.. మొత్తం 62 వేల ఓట్ల మెజారిటీ టిడిపి అభ్యర్థికి రావడం కారణమని చర్చ సాగుతోంది. మాజీ ఎమ్మెల్యే కోలగట్ల వల్లే కార్పొరేటర్లు అయ్యామని, పొరపాట్లు మానవ నైజం, ఇది తమకు గుణపాఠమని చెప్పిన వారూ ఉన్నారు. మెజార్టీ కార్పొరేటర్లు మాత్రం అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. మరో రెండేళ్లపాటు కార్పొరేషన్ పాలకవర్గం కాలం ఉండటంతో ఈ అసంతృప్తితో ఉన్న కార్పొరేటర్లు ఇలాగే ఉంటారా, ఫ్లేట్ ఫిరాయిస్తారా? అనే చర్చ నేడు నగరంలో పెద్దఎత్తున సాగుతోంది. ఇప్పటికే అధికార టిడిపి నాయకులతో కొంతమంది కార్పొరేటర్లు టచ్‌లో ఉన్నట్లు పుకార్లు వినిపిస్తున్నాయి. ఇది ఎంతవరకు నిజమో అన్నది కొద్ది రోజులు ఆగితే తేలనుంది. మొత్తంగా ఎమ్మెల్యే కోలగట్ల తీరుపై, కుటుంబ సభ్యుల వ్యవహార శైలిపై నిన్నటి వరకు మాట్లాడని వారు నేడు చర్చలు జరుపుతూ వారిలో ఉన్న అసంతృప్తిని బయట పెడుతున్నారు. ఈ అసంతృప్తి నగరంలో జరుగుతున్న చర్చ మాదిరిగా వాళ్ల వరకే పరిమితం అవుతుందా, లేదా ఫ్లేట్ ఫిరాయించే వరకు వెళ్తుందా అనేది వేచి చూడాల్సిందే.



మాయమైన హెచ్చరిక బోర్డులు

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలోని పూతికవలస, కస్పాగదబవలస, శివన్నపేటకు సమీపంలో సర్వే నంబర్లు 427,41, 25/7 సంబంధించిన సుమారు ఐదెకరాల మేర కొందరు స్థిరాస్తి వ్యాపారులు ఎటువంటి అనుమతులు లేకుండా లేఅవుట్లు వేసి అమ్మకాలు జరపడంతో గత నెల 23న ఆ స్థలాల వద్ద పంచాయతీ, రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. అనుమతులు తీసుకోవాలని పలుమార్లు నోటీసులు ఇచ్చినా ఇంతవరకు పంచాయతీ నుంచి, బుడా వారి వద్ద అనుమతులు పొందలేనప్పటికీ కొందరు అధికారులకు స్థిరాస్తి వ్యాపారులు కానుకలు అందజేయడంతో బోర్డులు పెట్టిన రెండు రోజులకే మాయం చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులను సంప్రదించగా అది బ్యానర్ తో ఏర్పాటు చేసినా ఆ బోర్డు ఎవ్వరిది తెలియదని తెలిపారు. మళ్లీ సోమవారం నోటీసులు ఇచ్చి అప్పటికి స్పందించకపోతే పర్మినెంట్ బోర్డు ఏర్పాటు చేస్తామని అన్నారు.

అధికారుల పర్యవేక్షణలో బిటి రహదారి పనులు

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం నుంచి మండ గ్రామ ప్రధాన బిటి రహదారి వరకు జరుగుతున్న బిటి మరమ్మతు పనులను ఆదివారం సాయంత్రం ఆర్అండ్‌బి అధికారులు సుశీల, నిర్మల దగ్గరుండి పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీటీ రహదారి మరమ్మతు పనుల నిమిత్తం సిఎంఎ నిధుల నుంచి రూ.3 కోట్లు 80 లక్షల నిధులు మంజూరయ్యాయని, ఎక్క డా నాణ్యతా లోపాలు లేకుండా దగ్గరుండి పర్యవేక్షిస్తూ పనులు చేయిస్తున్నారు.

ఉల్లాసంగా... ఉత్సాహంగా

ప్రజాశక్తి -సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో పర్యాటకులు ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. ఆదివారం సెలవు దినం కావడం, అందులోనూ వేసవి సెలవులు కావడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పార్కు పోటెత్తింది. పార్కులో ఉన్న అందాలను ఆస్వాదించడానికి జిల్లా నలుమూలల నుండే కాకుండా ఇతర జిల్లాల నుండి కూడా పర్యాటకులు తరలివచ్చారు. జలవిహార్ వద్ద హాయి హాయిగా బోటు షికారు చేశారు. అనంత్ విహార్ వద్ద ఉల్లాసంగా, ఉత్సాహంగా డాన్సులు వేశారు. హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కర్లు కొట్టారు. చిన్నారులు చిల్డ్రన్ పార్కు వద్ద సరదాగా ఆడుకున్నారు. చిన్నారులు మినీ బోటింగ్ మినీ ట్రైన్ ఎక్కి సరదాగా గడిపారు. అనంతరం మెట్టుగూడ జలపాతం వద్ద కేరింతలు కొడుతూ జలకాలాడారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రమైన వీరఘట్టం మహాత్మాగాంధీ 3 రోడ్ల జంక్షన్ నివాసముంటున్న మహాపాత్రో గిరిజన బుర్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1990 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆర్థికసాయం అందజేశారు. ఆదివారం సహచర విద్యార్థులు గిరిజ ఇంటికి వెళ్లి పరామర్శించి, కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. గిరిజ భర్త గౌరిపతికి అనారోగ్యం కారణంగా వైద్య ఖర్చుల నిమిత్తం ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు రూ.57,500 వైద్య ఖర్చుల నిమిత్తం నగదు అందజేశారు. ఇటీవల తన కుమారుడు కూడా మరణించడంతో పూర్వ విద్యార్థులు ఆమె పరిస్థితిని తెలుసుకొని చలించి ఆ కుటుంబాన్ని ఆదుకున్నారు. 1990 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఒక వాట్సాప్ గ్రూపుగా ఏర్పడి చేసుకొని, ఆపద ఉన్న కుటుంబానికి బ్యాచ్ అంతా సంఘటితంగా ఆదుకొని తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఇలాగే ఈ బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు పేదలను కూడా ఆదుకునేందుకు ముందుకు రావడం ఎంతో సంతోషంగా ఉందని పలువురు మనలు పొందారు.

కలిసెట్టిని కలిసిన సిఎల్ నాయుడు దంపతులు

ప్రజాశక్తి - పాలకొండ

సిఎల్ విద్యాసంస్థల అధిపతి, మాజీ ఎపిఐఐసి డైరెక్టర్ సిఎల్ నాయుడు, ఆయన భార్య, మాజీ సర్పంచ్ చొంగ రమాదేవి విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడుని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అప్పలనాయుడు ఎంపి పదవి వరించడం తమకెంతో సంతోషంగా ఉందని, మీ ద్వారా మరింత మంచి పనులు జరగాలని ఆకాంక్షించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి - కొమరాడ

ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు కట్టుకున్న లబ్ధిదారులకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించి అన్ని విధాల ఆదుకోవాలని సిపిఎం, గిరిజన, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో నాయకులు కొల్లి సాంబమూర్తి, ఆర్.శివన్నాయుడు, గిరిజన సంఘం నాయకులు వెంకటేష్ మాట్లాడుతూ 2018, 19లో టిడిపి ప్రభుత్వ అధికారంలో ఉండే సందర్భంగా ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద పేదలందరికీ ఇళ్లు మంజూరు చేశారన్నారు. అనంతరం వైసిపి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత జగనన్న కాలనీ కింద మండలంలో 2400 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేయగా, కేవలం 1250 మందికి మాత్రమే ఇళ్లు కట్టుకున్నారు. ఇంకా వివిధ దశల కింద 1150 మంది లబ్ధిదారులు ఇళ్లు కట్టుకోలేదు. అయితే నిర్మాణాలు ప్రారంభించిన 1210 మందికి నేటికీ బిల్లులు చెల్లించలేదు. కావున మళ్లీ ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చినందున గతంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు కట్టుకోలేని వారిని గుర్తించి బిల్లులు చెల్లించి వారికి భరోసా కల్పించాలని కోరారు.

తిరుపతినాయుడ్ని పరామర్శించిన మాజీ మంత్రి

ప్రజాశక్తి - సాలూరు

వైసిపి సీనియర్ నాయకులు, మాజీ జెడ్పిటీసీ సభ్యులు రెడ్డి తిరుపతి నాయుడును మాజీ మంత్రి రాజన్నదొర ఆదివారం పరామర్శించారు. మండలంలోని బాగువలసలో తిరుపతినాయుడు నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. గత కొంతకాలంగా తిరుపతినాయుడు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డి పద్మావతి, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ ఉన్నారు.

పాఠశాలలు పోటా పోటీ ప్రచారం

ప్రజాశక్తి - వీరఘట్టం

మరికొద్ది రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులను తమ పాఠశాలల్లో చేరాలని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది పోటీ పోటీ ప్రచారం మండలం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేసుకునేందుకు వీలుగా పాఠశాలల సిబ్బంది విద్యార్థులను తమ పాఠశాలలో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరుతున్నారు. అంతేకాక ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే ప్రభుత్వ పథకాలతో పాటు ఉచితంగా పుస్తకాలు మధ్యాహ్న భోజనం తదితర సౌకర్యాలు లభిస్తాయని చెబుతున్నారు. అలాగే మెరుగైన విద్యతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణంలో పిల్లలు ఉండేందుకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారు. మీ పిల్లల భవిష్యత్తు మా చేతిలో ఉందని, ఒకసారి ఆలోచించి పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులను సిబ్బంది వేడుకుంటున్నారు. మీ పిల్లలు భవిష్యత్తు బాగుండాలన్నా మీకు మంచి పేరు రావాలన్నా మీ చేతిలో ఉంది గనుక ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు ముందుకు రావాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. మరోవైపున మీ పిల్లలు బంగారు భవిష్యత్తుకు పునాది వేయాలంటే మా పాఠశాలలో చేర్పించాలంటూ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తల్లిదండ్రులను కోరుతున్నాయి. ఇలా ఎవరికి వారు తమ పాఠశాలల గొప్పతనం గురించి చెబుతుంటే పిల్లలను ఏ పాఠశాలల్లో చేర్పించాలని అర్థంకాని పరిస్థితుల్లో తల్లిదండ్రులు ఉన్నారు.

సింగరాయిలో పేరుకుపోయిన చెత్త

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సింగరాయిలో నిత్యం సాయంత్రం పూట ప్రజల కుర్చునే వంతెన వద్ద గ్రామంలో ఉన్న చెత్తను వేయడం వల్ల ఆ ప్రాంతమంతా దుర్గంధభరితంగా మారింది. ఈ చెత్త వల్ల నూతన చెరువులో ఉన్న చేపలకు కూడా తెగుళ్లు సోకుతున్నాయని యువకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం సాయంత్రం పూట కోవెల వద్ద, వంతెన వద్ద కూర్చోవడం గ్రామస్తులకు అలవాటుగా మారింది. చెరువు, కోవెల వద్ద ఉన్న చెట్లు నీడని గాలి కోసం ఎక్కువ మంది కూర్చోడం అలవాటు వచ్చాయి. ఇటువంటి ప్రాంతంలో దుకాణాల ద్వారా వచ్చిన వ్యర్థాలు, గ్రామస్తులు ఇంటిలో వాడుకున్న వేస్టేజ్ ఈ చెరువులో పడేయడం వల్ల వర్షానికి తడిసి వేస్ట్ పదార్థాలు కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతుంది. ప్రధానంగా ఎన్‌సిసి కాలనీలో ప్రధాన సీసీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాలువలో ఊరి నుంచి వచ్చిన వాడుక నీరుతో పాటు మురుగునీరు కూడా పోకుండా నిల్వ ఉండిపోయి దుర్వాసనతో అవస్థలు పడుతున్నారు. ఈ మురుగు కాలువల వల్ల ఈగలు, దోమలు నుంచి నిద్రలేక ఇబ్బంది పడుతున్నారని గ్రామ యువకులు నిరుజోగి కామేష్, జి.కనక, జి.సంతోష్, జే.అప్పలనాయుడు, నాయుడు, గుమ్మడి దేముడుబాబు, ఎన్ అప్పలనాయుడులు పంచాయతీ కార్యదర్శి కన్నంనాయుడును కోరినట్లు చెప్పారు. ఈ విషయంపై కార్యదర్శిని వివరణ కోరగా ఎన్నికలు పనుల్లో బిజీగా ఉన్నందున కొంత పారిశుధ్యం పనుల్లో వెనుక పడ్డానని గ్రామంలో పారిశుధ్య పనులు రెండు మూడు రోజుల్లో పూర్తి చేస్తారని, కూలీలు కూడా సమంగా దొరకలేదని చెప్పారు.



చెత్త పోగులను చూపిస్తున్న గ్రామస్తులు

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి- వేపాడ

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతోందని యువకులు అన్నారు. మండలంలోని జగ్గయ్యపేట గ్రామానికి చెందిన యువకులు ఆనందపురం జంక్షన్ నుంచి సోంపురం జంక్షన్ వరకు గల ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఆదివారం మొక్కలు నాటారు. పైడితల్లి అమ్మవారి గుడి వద్ద నుంచి అరిగిపాలెం చెరువు వరకు ఇరువైపులా సుమారు రూ. 20వేలు విలువైన మొక్కలు నాటారు. యువకులు నాటిన మొక్కల్లో బాదం, నేరేడు, ఉసిరి, తురాయి, నీడనిచ్చే పలు రకాల మొక్కలున్నాయి. పశువులు, మేకలు, గొర్రెలు పాడు చేయకుండా రక్షణ కంచె ఏర్పాటు చేశారు. యువకులు చేపట్టిన ఈ సేవా కార్యక్రమానికి గ్రామస్తులు అభినందనలు తెలిపారు. గతంలో వేసిన 90 శాతం మొక్కలు ప్రస్తుతం నీడనిస్తున్నాయని యువకులు చెబుతున్నారు.



మొక్కలు నాటుతున్న యువకులు

లలితకుమారికి అభినందనల వెల్లువ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

సార్వత్రిక ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన కూటమి ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారికి అభినందనల వెల్లువ కొనసాగుతుంది. ఆదివారం లక్కవరపుకోట మండల కేంద్రంలోని ఆమె నివాసానికి నియోజకవర్గ నలుమూలల నుంచి, జిల్లాలో వివిధ ఉద్యోగ రంగాల్లో ఉన్న ఉద్యోగస్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.కోట నియోజకవర్గానికి చెందిన ఐదు మండలాల టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌కోట: లలితకుమారికి జ్ఞాపికను అందిస్తున్న ఉద్యోగులు



వేపాడ: ఎమ్మెల్యే లలితకుమారిని అభినందిస్తున్న మహిళలు

వేపాడ: మండలంలోని దబిరాజుపేటకు చెందిన టిడిపి మహిళా నాయకులు ఎమ్మెల్యే లలిత కుమారి నివాసానికి వెళ్లి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లలిత కుమారి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల రాంప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దబ్బిరాజుపేటకు చెందిన మహిళలు పొట్నూరి రేవతి తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఎమ్మెల్యేకి అభినందనలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

జనసేన నుంచి ఎన్నికైన నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవిని తన నివాసంలో ఆదివారం ఎస్.కోట నియోజకవర్గ జనసేన నాయకులు వబ్బిన సన్యాసి నాయుడు కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు సుంకర అప్పారావు, గొరపల్లి రవి, షేక్ ఫిరోజ్, వర్మ రాజు, మంచిన జానీ, రామెల్ల శివాజీ, జొన్నపల్లి సత్తిబాబు, మల్లువలస నాని, జనపరెడ్డి వెంకటరమణ, పత్రాన రవి, దాసరి శివ తదితర నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే లోకం నాగమాధవికి అభినందనలు తెలుపుతున్న వబ్బిన

జన సైనికుల సంబరాలు



పేదలకు బట్టలు పంపిణీ చేస్తున్న జనసేన నాయకులు

మండలంలోని ధర్మవరం గ్రామంలో పిఠాపురం ఎమ్మెల్యేగా పవన్ కళ్యాణ్ గెలవడంతో ఆయన అభిమానులు, జనసైనికులు, జనసేన నాయకులు ఆదివారం సంబరాలు నిర్వహించారు. ఇందులో భాగంగా సాయంత్రం భారీ ఫ్లెక్సీని ఏర్పాటు చేసి పెద్ద కేకును కత్తిరించారు. అనంతరం దీనిని గ్రామస్తులకు పంచిపెట్టారు. గ్రామంలో ఉన్న పేదలకు బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు కుసుమంచి నానాజీ, డేవిడ్, సన్యాసిరావు, బంగారయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విజయం వెనక తమ నాయకుడు పవన్ కళ్యాణ్ చేసిన కృషి ఎంతో గొప్పదని భవిష్యత్తులో జనసేన పార్టీ అధికారంలోకి వచ్చి పాలన సాగిస్తుందని ఆశా బావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సతీష్ కుమార్, చరణ్ కుమార్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

రామోజీరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి - గుర్ల

భారత దేశ పత్రిక రంగంలో మంచి వ్యక్తిని కోల్పోయామని ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షులు, టిడిపి నాయకులు డాక్టర్ సుంకరి రమణమూర్తి అన్నారు. గుర్లలో ప్రెస్ క్లబ్ వద్ద టిడిపి, జనసేన, ఉత్తరాంధ్ర విద్యార్థి సేన, గుర్ల ప్రెస్ క్లబ్ సభ్యులు సంయుక్తంగా రామోజీరావుకు ఆదివారం శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈనాడు, ఈటీవీ సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు మరణం మీడియా రంగానికి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బీసెల్ కార్యదర్శి వెన్నె సన్యాసినాయుడు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, జనసేన విజయనగరం కోఆర్డినేటర్ కోట్ల కృష్ణ, జనసేన సీనియర్ నాయకులు దంతులూరి రమేష్ రాజు, టిడిపి మండల అధ్యక్షులు చెనమల్లు మహేశ్వరరావు, నాయకులు నాగులపల్లి నారాయణరావు, వల్లూరు భాస్కరరావు, సుంకరి ఉపేంద్ర, సీనియర్ పాత్రికేయులు తవుడు, మజ్జి రామారావు, సూర్యనారాయణ, లక్ష్మంనాయుడు, పైడినాయుడు, రాము నాయుడు, భాస్కరరావు నరసింహమూర్తి, శంకర్, ఈశ్వరరావు, గేదెల సత్యనారాయణ, విద్యార్థి సేన నాయకులు సుంకరి నారాయ ణరావు, మీసాల జగన్, వల్లూరు నాయుడు తదితరులు పాల్గొన్నారు.



గుర్ల: రామోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

బాడంగి: రామోజీరావు మృతి పట్ల విజయనగరం పార్లమెంట్ తెలుగు యువత అధికార ప్రతినిధి రాంప్రసాద్ ఆదివారం సానుభూతిని తెలిపారు. సామాన్య రైతు కుటుంబంలో పుట్టి ఓ పెద్ద సామ్రాజ్యాన్ని సృష్టించారని గుర్తు చేశారు.

ఆర్‌టిసి నిర్లక్ష్యం అన్యాయం

బొబ్బిలి: వృద్ధులు పట్ల ఆర్‌టిసి ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని పట్టణానికి చెందిన యువకుడు పితాని శ్రీనివాసరావు అన్నారు. రాజాం వెళ్లేందుకు అమ్మిగారి కోనేరు గట్టు వద్ద వృద్ధురాలు బస్సు కోసం నిరీక్షిస్తుందని శ్రీకాకుళం వెళ్లే బస్సులు రెండు వచ్చినప్పటికీ బస్సు ఒక్క క్షణం ఆపి వృద్ధురాలను చూసి వెళ్లిపోయాయన్నారు. ఇది చూసిన అక్కడే ఉన్న తాను మూడో బస్సును ఆపి ఆ వృద్ధురాలను ఎక్కించినట్లు తెలిపాడు. వృద్ధులు పట్ల ఆర్‌టిసి డ్రైవర్లు, కండక్టర్లు నిర్లక్ష్యం మంచిది కాదన్నారు.

గ్రంథాలయంలో 'చదువంటే మాకిష్టం'

ప్రజాశక్తి- డెంకాడ

స్థానిక శాఖా గ్రంథాలయంలో ప్రతి ఆదివారం నిర్వహించే చదువంటే మాకు ఇష్టం కార్యక్రమాన్ని ఈ ఆదివారం కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో లైబ్రేరియన్ మహేశ్ కథల పుస్తకాలను చదివించారు. అనంతరం విద్యార్థులు చెస్, కేరమ్స్, లూడో, స్నేక్ అండ్ లేడర్ వంటి ఇండోర్ క్రీడలను ఆడించారు.



డెంకాడ: కథలు పుస్తకాలు చదువుతున్న విద్యార్థి

విద్యతో పాటే ఆటలు

శృంగవరపుకోట: విద్యతో పాటే మెదడుకు పదును పెట్టే ఆటలు అవసరమని శాఖ గ్రంథాలయ అధికారి దామోదర్ శ్రీధర్ అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు ప్రతిరోజు నీతి కథలు చదివించడం, కథలోని నీతులు చెప్పించడం, చదరంగంలో మెలకువలను నేర్పించడం, కేరం బోర్డు వంటి ఆటలను ఆడించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 15 మంది విద్యార్థులు పాల్గొన్నారని ఆయన తెలిపారు.



ఎస్‌కోట: క్రీడలను పరిశీలిస్తున్న దామోదర్ శ్రీధర్

24వ రోజుకు జిందాల్ సమ్మె

ప్రజాశక్తి - కొత్తవలస

జిందాల్ కర్మాగారం వద్ద కార్మికులు చేస్తున్న సమ్మె ఆదివారం నాటికి 24వ రోజుకు చేరింది. జిందాల్ కర్మగారాన్ని యాజమాన్యం బెషరతుగా తెరిపించి కార్మికులందరికీ పని కల్పించాలని కార్మికులు డిమాండ్ చేశారు. 24 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా యాజమాన్యానికి చీమ కుట్టినట్లైనా లేదని కార్మికు ఆందోళన వ్యక్తం చేశారు. తమ బతుకులు చిన్నాభిన్నమైనప్పటికీ యాజమాన్యం చోద్యం చూస్తుందని ఆరోపించారు. జిందాల్ కార్మికులకు ఎటువంటి సమాచారమూ లేకుండా యాజమాన్యం కార్మికులను రోడ్డుపైకి నెట్టిందని, ముందస్తు సమాచారం లేకుండా కంపెనీకి లే ఆఫ్ ప్రకటించడం ఏంటని ప్రశ్నించారు. యాజమాన్యం బేషరతుగా కంపెనీ తెరిచి, కార్మికులందరికీ పని కల్పించాలన్నారు. ఎస్‌కోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆదివారం వంటావార్పుకు సహకరించారు. ఈ కార్యక్రమంలో అప్పన్న పాలెం సర్పంచ్ కోన దేవుడు, ఉత్తరాపల్లి సర్పంచ్ సింగంపల్లి గణేష్, సిఐటియు జిల్లా నాయకుడు గాడి అప్పారావు, జిందాల్ టిఎన్‌టియుసి నాయకులు పిల్ల అప్పలరాజు, సలాది భీమయ్య, వైఎస్ఆర్‌టియుసి నాయకులు లగుడువామాలు, పెదిరెడ్ల ప్రసాద్, నమ్మి చినబాబు, బొట్ట రాము, బాలిబోయిన ఈశ్వరరావు పాల్గొన్నారు.



నిరసన శిబిరంలో పాల్గొన్న కార్మికులు, నాయకులు

సేవ, భక్తి, ఆరోగ్యమే లక్ష్యం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

సేవ, భక్తి, ఆరోగ్యమే లక్ష్యంగా మండలంలోని భర్త పురం గ్రామంలో గల కళ్యాణ ప్రసన్న వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్వహణ జరుగుతుందని ఆలయ కార్య నిర్వాహకులు కాంద్రేగుల జై విష్ణు, కాంద్రేగుల ఈశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం వారు మాట్లాడుతూ ప్రతి ఆదివారం రోగులకు ఆలయం వద్ద వారికున్న రుగ్మతులను బట్టి హెూమియో వైద్యం ద్వారా మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. చిన్నతనం నుండే పిల్లలకు భక్తి భావం నేర్పించే విధంగా క్లాసులు నిర్వహిస్తున్నామన్నారు. మద్యానికి బానిసైన వారిని మంచి మార్గంలో నడిపించేందుకు వైద్యంతో పాటు వారికి మంచి సలహాలను ఇస్తున్నామన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు అన్న ప్రసాదాలు కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

జనసేన కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- బొబ్బిలి

గొల్లపల్లిలో ఇటీవల మరణించిన జన కార్యకర్త వంగపండు శంకరరావు కుటుంబ సభ్యులకు జనసేన రాష్ట్ర కార్యక్రమాల నిర్వహణ కార్యదర్శి బాబు పాలూరి రూ.10 వేలు ఆర్థిక సహాయం చేశారు. జనసైనికులకు అండగా ఉంటామని బాబు పాలూరి అన్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చి శంకరరావుకు సంతాపం తెలిపారు.



మాట్లాడుతున్న బాబు పాలూరి

IN THE HONOURABLE CIVIL JUDGE (SENIOR DIVISION) COURT AT VIZIANAGARAM S.O.P.No.3/2024

Between:

1. Sri. Gainedy Ramateja, S/o late Bhoga Rao, Hindu, aged 38 years, working as a Senior Officer, Coromandel Fertilizers, Visakhapatnam, residing in Door No.20-8-4/5A, Anandapeta, Near Lanka Veedhi, Vizianagaram, Vizianagaram District.

2. Smt.Gainedy Ramasandhya, W/o Pandiripalli Ganapathi Rao, D/o Gainedy late Bhoga Rao, Hindu, aged 39 years, presently residing in Door No.20-8-4/5A, Anandapeta, Near Lanka Veedhi, Vizianagaram. ....Petitioners

And

Nil ....Respondents

PUBLIC NOTICE

This is to inform to all the public in general that the petitioners. 1. Sri. Gainedy Ramateja, S/o late Bhoga Rao, Anandapeta, 2. Smt. Gainedy Ramasandhya, W/o Pandiripalli Ganapathi Rao, D/o Gainedy late Bhoga Rao, are filed SOP.3/2024 before the Hon'ble court for issuing Succession certificate to receive the schedule mentioned dividend warrants shown in the schedule stands on the name of their deceased father and mother by names Gainedy Bhoga Rao and Smt. Gainedy Chandrakala Devi, W/o. Bhoga Rao, being Class-1 legal heirs. The father of the petitioner by name Gainedy Bhoga Rao died on 30-04-2021 at Vizianagaram due to Corona decease. The mother of the petitioners, Gainedy Chandra Kala Devi also died on 06-05-2021 at Vizianagaram due to Corona. The amounts as on date mentioned in the schedule, for which the petitioners applied for succession certificate.

Item No.1: Amounts of Smt. GAINEDY late CHANDRAKALA DEVI (Mother of the petitioners)

1). FT1036- Franklin India PRIMA FUND -
2). FT1309 Franklin India Ultra Short Bond Fund Super Institutional Plan -
3. FT1219-Franklin India Smaller Companies Fund -
4). FT1034-Franklin India TAXSHIELD -
5). P121 ICICI Prudential Multicap Fund -
6). 1088KGPG-UTI Banking & Financial Services Fund -
7). 108MCGPGUTI Mid Cap Fund Regular Plan-
8). 108MRGPGUTI Mastershare Unit Scheme Regular Plan
9). 108EQGPG - UTI Flexi Cap Fund (Formerly known as UTI Equity Fund) Regular Plan
10). 108MFGPGUTI MNC Fund - Regular Plan

Total value- Rs. 20,88,195.33

Item No.2 :Amounts of Gainidy late Bhoga Rao (father of the petitioners)

1). PEDWRG-ICICI PRUDENTIAL Balanced Advantage Fund - Growth
2). P-41-ICICI Prudential FMCG Fund -Growth
3). PAMP-ICICI Prudential Asset Allocator Fund (FOS) Growth (Formerly ICICI Prudential Advisor Series-Moderate Plan).
4). P-1191-ICICI Prudential Blue Chip Fund-Growth (Formerly ICICI Prudential Focused Blue Chip Equity Fund)
5). P 3392-ICICI Prudential MNS Fund Growth
6). P 1543-ICICI Prudential Floating Interest Fund-Growth (Formerly ICICI Prudential Savings Fund)
7). PDFG-ICICI Prudential Value Discovery Fund-Growth
8). PEDWRG-ICICI Prudential Balanced Advantage Fund-Growth.
9). PO1-ICICI Prudential Long Term Equity Fund (Cash Savings)-Growth

Total value- Rs. 3930352.94

As per order orders of the Hon'ble court in the above SOP.3/2024 this publication given. If anyone has got any objection, may be pleased to attend on **20-06-2024 at 10-30 A.M.**, before the Hon'ble court mentioned above, in person or through an Advocate and submit objections and claims if any. Otherwise the Hon'ble court will be proceed according to law for issuing of Succession Certificate on the name of petitioners.

K.KAMESWARA RAO
ADVOCATE FOR PETITIONERS
Door No.13-5-66, Kurellavari street,
Kottapeta, Vizianagaram,
Vizianagaram-535 002
Cell No.9640014321.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని కృష్ణపల్లి పంచాయతీ చెరువుగట్టు కాలనీకి సంబంధించిన చింతాడ కుమారి (42) వివాహిత శుక్రవారం రాత్రి తల్లి మందలించిందని మనస్తాపం చెంది ఇంట్లో ఉన్న ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. విషయం తెలుసుకున్న స్థానికులు పార్వతీపురం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తుండగా ఆదివారం ఆమె మృతి చెందినట్లు రూరల్ ఎస్సై దినకర్ తెలిపాశారు. ఆమెకు వివాహమైనా భర్త లేనప్పటికీ ఒక కుమారుడితో తన తల్లి ఇంట్లో నివసిస్తుంది.

పేకాట శిబిరంపై దాడి

మండలంలోని లక్ష్మీనారాయణపురం సమీపంలో పేకాట శిబిరం నిర్వహిస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు ఎస్సై దినకర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి రూ.1,2535 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఏడుగుర్ని అదుపులో తీసుకున్నట్లు తెలిపారు.

గజపతినగరంలో భారీ చోరీ

ప్రజాశక్తి - గజపతినగరం

గజపతినగరంలో శనివారం రాత్రి దొంగతనం జరిగిందని ఎస్ఐ మహేష్ తెలిపారు. ఆయన అందించిన వివరాల ప్రకారం.. ఆర్‌టిసి కాంప్లెక్స్ దగ్గరలో నివాసముంటున్న బొడ్డేట తిరుపతి అనే వ్యక్తి తీర్థయాత్రల కోసం శనివారం బయటకు వెళ్లగా అతని మేనమామ నాగరాజుకు ఇంటి బాధ్యత అప్పజెప్పాడు. ఆదివారం ఇంటికి వెళ్లి చూసేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో అనుమానం వచ్చిన నాగరాజు లోపలికి వెళ్లి చూడగా వస్తువులన్నీ చిందరవందరగా పడి, బీరువాలు బద్దలు కొట్టే ఉన్నాయి. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. 25 తులాల బంగారం, రూ.లక్ష నగదు చోరీకి గురైనట్లు తెలిపారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని జాతీయ రహదారిపై అమనం వంతెన సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లా సంతకవిటి మండలం సిరిపురం గ్రామానికి చెందిన బొడ్డెపు వెంకటేష్ (33) మృతి చెందాడు. వెంకటేష్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా హైదరబాదులో పనిచేస్తున్నాడు. ఇటీవలి మొదడకు సంబంధించిన ఆపరేషన్ జరిగింది. తన కుటుంబ సభ్యులతో కలిసి విశాఖపట్నం నుంచి కారులో ఇంటికి వెళ్తున్నారు. అమనం వంతెన వద్ద బహిర్భూమి కోసం రోడ్డు దాటుతుండగా శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సమాచారం అందుకున్న భార్య శ్రీలేఖతో పాటు కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. దీనిపై ఆయన తండ్రి సహదేవరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సూర్యకుమారి తెలిపారు.